క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి హరీశ్‌రావుకు మొక్కను అందజేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం ఆయన నివాసంలో కార్పొరేటర్ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగడ్డ నగేష్, రాకేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న ఏపీ ఎమ్మెల్యే శంకర్‌రావు

పటాన్‌చెరు టౌన్: ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కుమారుడు గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. దీంతో మహిపాల్‌రెడ్డిని తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెద్దకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్‌రావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేసే ఎమ్మెల్యేకు పుత్రశోకం కలగడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని దోవూరు చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జెండాను విరగొట్టిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జెండాను విరగ్గొటడం హేయమైన చర్య అని అభివర్ణించారు. సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు గణపతి, శివానంద్, నర్సింహులు, రాజ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని సందిగూడెం ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు లర్నింగ్ స్లేట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు.

జాబ్‌మేళాతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

కొండాపూర్/సంగారెడ్డి మున్సిపాలిటీ : జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మకూరు నాగేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చింతా ప్రభాకర్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆత్మకూరు నాగేష్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జాబ్ మేళాలో 100కు పైగా ప్రైవేట్ పరిశ్రమలు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయనిర్మల, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు



కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బాన్సువాడ గ్రామంలో సోమవారం పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, మతాలకు అతీతంగా సమీప గ్రామాల ప్రజలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రంతా ఆటపాటలతో హోరెత్తించారు.

బీమాతో రైతన్నకు ధీమా

- ఆర్థిక భరోసా కల్పిస్తున్న పథకం
- ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లింపు
- దరఖాస్తు గడువుకు చివరి తేదీ ఆగస్టు 5



రైతుబీమా దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): రైతు కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో రైతుబీమా పథకం ఒకటి. వ్యవసాయం చేస్తూ కుటుంబాలను పోషించే రైతు అకాలంగా మృతి చెందితే ఆ రైతుపై ఆధారపడిన కుటుంబసభ్యులు మానసికంగా కుంగిపోకుండా ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

అకాలంగా రైతు చనిపోతే బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక ఇబ్బందులు రావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకానికి 2018లో శ్రీకారం చుట్టింది. ఎల్‌ఐసీతో ఒప్పందం కుదుర్చుకుని 18నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న ప్రతి రైతుకు రైతు బీమా పథకం వర్తించేవిధంగా చర్యలు చేపట్టింది. దీంతో బీమా కలిగి ఉన్న సంబంధిత రైతు చనిపోతే రూ.5లక్షల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందుతోంది.

పారదర్శకంగా పథకం అమలు

ఈ ఏడాది రైతుబీమా పథకంలో జిల్లాలోని 1,81,510 మంది రైతులు నమోదై ఉన్నారు. ప్రతి ఏడాది అర్హులైన రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు రైతుబీమా పథకానికి దరఖాస్తులను స్వీకరించి నమోదు చేస్తున్నారు. పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తూ రైతు కుటుంబాలకు లబ్ధి చేకూర్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా 1,054 రైతు కుటుంబాలకు రూ.52.7 కోట్ల బీమా డబ్బును వ్యవసాయశాఖ అందించింది. అదే విధంగా 2019–20లో 1,158 కుటుంబాలకు రూ.57.9 కోట్లు , 2020–21లో 1,928 కుటుంబాలకు 96.4 కోట్లు, 2021–22 లో 1,410 రైతు కుటుంబాలకు రూ.70.5 కోట్లు, 2022–23లో 1,025 రైతు కుటుంబాలకు రూ.51.25 కోట్ల ఆర్థిక సహాయం అందింది.

దరఖాస్తుకు ఆగస్టు 5 వరకు గడువు

ఈ ఏడాది అర్హులైన రైతుల నుంచి రైతుబీమా పథకానికి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. అర్హులైన రైతులు తమ భూపట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారంతో జత చేసి వ్యవసాయశాఖ సిబ్బందికి అందించి పథకంలో చేరాలి.

అవగాహన కల్పిస్తున్నాం



రైతుబీమా పథకం రైతు కుటుంబానికి ఆర్థికంగా తలెత్తే ఇబ్బందులను అధిగమించడానికి దోహదపడుతోంది. ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.3,830 ప్రీమియం డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– అభినాష్‌వర్మ, ఏఓ, రాయికోడ్

స్వయం సహాయక సంఘాలకు పెద్దపీట



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి మున్సిపాలిటీ: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. సోమవారం పాత డీఆర్డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.50 కోట్ల రుణాలు ఇస్తే, ఇప్పుడు ప్రభుత్వం 1000కోట్ల రుణాలు అందిస్తోందన్నారు. వడ్డీలేని రుణాలను ఇస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేవిధంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆగస్టు చివరిలోపు స్వయం సహాయక సంఘాలకు రూ.500 కోట్ల రుణాలను అందించేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నేత చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో మొక్కలు నాటారు. డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఏపీడీ సూర్యరావు, కంది జెడ్పీటీసీ, సెర్ప్ సిబ్బంది, డీపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం సిర్గాపూర్ మండలంలోని ఉజలంపాడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సంజీవ్ అనారోగ్యంతో మృతి చెందగా భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, జాగృతి జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రాజ్ శేరికార్ పాల్గొన్నారు. మండలంలోని నర్సాపూర్ మాజీ సర్పంచ్ మారుతిపటేల్ భార్య, పోతన్‌పల్లి (ఎం) గ్రామానికి చెందిన దండె సాయిలు అనారోగ్యంతో మృతిచెందగా వారికి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. ఖేడ్ మండలంలోని చాప్టా(కె)కు చెందిన 40మందికి సంబంధించిన ఆసరా పింఛన్లు అధికారుల పొరపాటు కారణంగా కంగ్టి మండలంలోని చాప్టా గ్రామానికి బదిలీ కావడంతో అక్కడికి వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి వస్తోందని బాధితులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకోగా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్య త్వరగా పరిష్కరించాలని సూచించారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

డ్రైవింగ్ పరీక్షకు తరలిన యువకులు

నారాయణఖేడ్: ఎంబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ మేళాలో భాగంగా ఈ నెల 21నుంచి దరఖాస్తుల స్వీకరణ సోమవారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజున ఎమ్మెల్యే దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 11వేల వరకు దరఖాస్తులు రాగా దరఖాస్తు చేసుకున్న నిజాంపేట్, పంచగామ గ్రామాలకు చెందిన 50మంది యువకులు డ్రైవింగ్ పరీక్ష కోసం జహీరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లినట్లు ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరు టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నందన్ రతన్ ఫ్రైడే కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అన్నారు. సోమవారం రతన్ ఫ్రైడే కాలనీలో ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో గత మూడేళ్లుగా కాలనీలో సరిగా డ్రైనేజీలు, మురుగుకాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ పూర్తిగా జలమయం అవుతోందని, దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు జైపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి యాదిరెడ్డి, మల్లేష్ మహిళా నాయకురాలు పూర్ణిమ, బసవమ్మ, గీత పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో నైబర్‌హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్ నాగరాజు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా నైబర్ హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవికాలంలో సైతం విద్యార్థులకు వివిధ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని గుర్తు చేశారు. నైబర్ హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, ప్రతినిధులు సుధాకర్, రవి రమణ, దీప్తి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సంగారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంగారెడ్డిలో విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఐబీ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు, హెల్త్ స్కీం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్ కుమార్, ఉమాదేవి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

సేవా కార్యక్రమాలు విస్తృతం

- బీఆర్‌ఎస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ఎస్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని బీఆర్‌ఎస్ నేత, ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం సేవా కార్యక్రమాల్లో భాగంగా పటాన్‌చెరు పట్టణం హనుమాన్ దేవాలయ సమీపంలో నివసించే మహమ్మద్ పాషా కేన్సర్ పేషెంట్‌కు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం ఎంజీ రోడ్డులో నివసించే శివప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదం అతని కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని వివిధ కాలనీలలో వర్షంతో ముంపునకు గురైన దాదాపు 80 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు లక్ష్మీ, సడబోయిన పాండు, సాయిరాజు, శ్రీకాంత్, భరత్, నరసింహ, నీరుడు మౌనిక, మట్టిల లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండే లక్ష్మమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

జీపీ కార్మికులపై చిన్నచూపు తగదు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

వట్‌పల్లి(అందోల్): గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరైంది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. అందోల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారని వాపోయారు. సమ్మె చేపట్టి 26 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, కార్మికులు వీరేశం, శ్రీనివాస్, వీరేశం, గంగా రాములు తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలో కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

26వ రోజుకు చేరిన సమ్మె

సదాశివపేట(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద కార్మికులు వంటవార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాల్సిందే



ఆర్డీఓ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర శాఖ సూచన మేరకు ఐదు దశల ఉద్యమ కార్యాచరణలో భాగంగా మొదటి రోజు నిరసన చేపట్టామన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, నాయకులు తుక్కప్ప, శ్రీపాల్, అన్నపూర్ణ, మొగులయ్య, కృష్ణ, శ్రీరాం, మల్లేశం, విజయ్‌కుమార్, అనురాజ్, హన్మంతు, రమేష్, శివశేఖర్, స్వరూపరాణి, శోభారాణి పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఝరాసంగం: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం రాత్రి క్రిస్టియన్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తులతో ర్యాలీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. పట్టణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

మణిపూర్ ఘటనను నిరసిస్తూ సోమవారం మండలంలోని హోతి(బి) గ్రామంలో క్రైస్తవులు ప్రధాన మంత్రి నరేంద్రమోది దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మణిపూర్ మహిళలపై క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు అవినాష్, బన్నీ, అబ్రహం, శ్రీపాల్, సంతోష్ పాల్గొన్నారు.

కేంద్రం స్పందించాలి

ఝరాసంగం(జహీరాబాద్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై కేంద్రప్రభుత్వం స్పందించాలని క్రిస్టియన్ యూత్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఝరాసంగం చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు చింతల్‌గట్టు శివరాజ్, ప్రకాశ్, నర్సింలు, దేవపుత్ర, రమేష్, రాజ్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 16మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 16మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 11మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

◆ సస్పెండ్ చేయాలి

సంగారెడ్డి అర్బన్: వికలాంగుల సంక్షేమశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని ఎంపీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడువయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం వికలాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ పథకాల కోసం వికలాంగుల నుంచి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి అధికారులు సస్పెండ్ చేయకుంటే ఆగస్టు 7న ధర్నా చేస్తామని హెచ్చరించారు.

◆ పింఛన్ పత్రాలు అందజేత

పటాన్‌చెరు: ఉద్యోగుల పింఛను పథకం–1905 ద్వారా ప్రయాస్ కార్యక్రమాలు ప్రతినెలా నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి అసిస్టెంట్ కమిషనర్లు పీవీ రావు, శ్రీదేవి తెలిపారు. పీఎఫ్ కార్యాలయం ద్వారా మంజూరైన పింఛన్ పత్రాలను సోమవారం 14 మందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందాదారులకు చేరువయ్యేలా డిజిటల్ విధానాల ద్వారా సకాలంలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ అకౌంట్స్ అధికారి బబుల్‌నాథ్ నాయక్ పాల్గొన్నారు.

◆ ఘనంగా బోనాలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంలో సోమవారం బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తొట్టెల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి, స్థానిక నాయకులు వడ్డె కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

◆ రాయిపల్లిలో గడప గడపకు కాంగ్రెస్

జహీరాబాద్: మండలంలోని రాయిపల్లి(డి) గ్రామంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పేరుతో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ వైద్యశిబిరం ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షోయల్, ఏఎన్ఎం పుష్పాంజలి, ఆశవర్కర్ వరకుమారి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందునా సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి, రమేష్ పాల్గొన్నారు.

◆ దళితబంధు సాధన సమితి కమిటీ ఎన్నిక

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం దళితబంధు సాధన సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా రాంచందర్, కో కన్వీనర్‌లుగా గీత, ఏసురత్నం, కిషన్, చంద్రయ్య, ప్రేమానందం, మల్లేశం, పూర్ణచందర్‌రావు, లింగం, భాస్కర్, సురేష్, రవీందర్, సాయికిరణ్, మొగులయ్య, శివకుమార్, కిషోర్‌ను ఎన్నుకున్నారు.

◆ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిపై వేటు

జహీరాబాద్: జహీరాబాద్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎంఆర్‌ఎఫ్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజి రాములును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తన సొంత ప్రయోజనాల కోసం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి పార్టీకి నష్టం చేకూర్చడంతో పాటు కార్మిక విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

◆ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ఎల్‌డీఎం ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

◆ బకాయిలు చెల్లించాలని వినతి

జహీరాబాద్: రెండేళ్ల క్రితం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన బిల్లులకు సంబంధించి బకాయిలను వెంటనే చెల్లించాలని నీటి సరఫరాదారులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట సమావేశమై తమ సమస్యలను డీఈ సాబేర్‌అలీకి విన్నవించారు. ఈ సందర్భంగా నీటి సరఫరాదారులు మాట్లాడుతూ బిల్లులు చెల్లించకుండా దాటవేస్తూ వస్తున్నారని వాపోయారు.

◆ బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్ అన్నారు. సంగారెడ్డిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల ప్రజలను అణగదొక్కుతోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమైయ్యారని ధ్వజమెత్తారు.

◆ రైతులను ఆదుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజోద్దిన్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ ఖాన్, రెహమాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు షఫీఅహ్మద్, కాశీనాథ్, నర్సింలు, అనురాధ, సదాశివపేట పట్టణ కార్యదర్శి వినోద, కంది మండల కార్యదర్శి ఖాజా, నాయకులు మహేష్, మోహన్, లక్ష్మి, బుజ్జమ్మ, సమద్ పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న రుద్రచండీయాగం

నారాయణఖేడ్: ఖేడ్‌లోని సత్యసాయికాలనీలో మహతీ జ్యోతిష్యాలయంలో అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ వేదపండితులు మలమంచి గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ సహస్రనామ పారాయణ పూర్వక రుద్రచండీ యాగం కొనసాగుతోంది. ఈ సందర్భంగా సోమవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఉప ఫ్లోర్ లీడర్ దారం శంకర్, నాయకులు గిరిధర్ చౌహాన్, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొని గురుజ్యోషి ఆశీస్సులు పొందారు.